GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా
T MEDIA
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్

సంపుటి : 7 | సంచిక : 47 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం : అక్టోబర్-19-2024 | పేజీలు : 4

## మరోసారి రష్యా పర్యటనకు ప్రధాని మోదీ..

### -నాలుగు నెలల్లో రెండోసారి



**టీ మీడియా, అక్టోబరు 18,**ధప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి రష్యా పర్యటనకు వెళ్లనున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు కజాన్‌లో ఈనెల 22 నుంచి 24 వరకూ జరగనున్న 16వ బ్రిక్స్ సమ్మిట్ లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 22 నుంచి 23 వరకూ రష్యాలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఈ పర్యటన సందర్భంగా మోదీ.. బ్రిక్స్ సభ్యదేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారని పేర్కొంది.కాగా, నాలుగు నెలల్లో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లడం ఇది రెండోసారి. ఈ ఏడాది జులై 8 - 9 తేదీల్లో ఆయన రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర తర్వాత మాస్కోలో తొలిసారి పర్యటించారు. 22వ భారత్ %-% రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. అదేవిధంగా రష్యాలోని భారత సంతతి ప్రజలతో కూడా ప్రధాని మోదీ సమావేశం అయ్యారు.

# జమిలికి ప్రధాని సిద్ధం

- అదే బాటలో మనమూ
- మళ్లీ రావణ కాష్టం కారాదు
- ఎమ్మెల్యేలకు చంద్రబాబు హితవు



**టీ మీడియా, అక్టోబరు 18,విజయవాడ :**తప్పు చేసిన వారిని వదిలి పెట్టకూడదు, అలాగని కక్షసాధింపులకు వెళ్లకూడదు ఈ వ్యత్యాసాన్ని గమనించాలి. సంఘటిత శక్తిగా పనిచేస్తేనే ప్రజల అంచనాలను అందుకోగలం. ఎన్డీఏలో ఎవ్వరు తప్పు చేసినా ఆ ప్రభావం ముఖ్యమంత్రి మీదే పడుతుంది, ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. అని ఏపీ సీఎం చంద్రబాబు హితబోధ చేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది.ఎన్టీఆర్ ప్రతిమకు నివాళులర్పించి ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేలతో మాట్లాడుడుతూ, స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సమావేశం పట్ల రాష్ట్రం మొత్తం ఎందుకు ఆసక్తి కనబరుస్తుందో ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. చేసిన పనులను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని పార్టీ భవిష్యత్తు దృష్ట్యా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏ నమ్మకంతో ప్రజలు మనకు ఓటేశారో ఆ నమ్మకాన్ని అంతా నిలబెట్టుకోవాలని సూచించారు. ఐదేళ్లు తీవ్రంగా నష్టపోయి, కష్టనష్టాలు ఎదుర్కొన్న కార్యకర్తల బాధను సమన్వయం చేసుకోవాలన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినా.. ఈ విధంగా అధికారులు సహా వ్యవస్థలన్నీ నాశనమైన పరిణామాలు గతంలో చూడలేదన్నారు.

**జమిలికి సిద్ధపడటానికే ..**

నాయకుడికి విశ్వసనీయత రావాలంటే ఎంతో సమయం పట్టినా చెడకొట్టుకోవాలనుకుంటే నిమిషం చాలు. నాతో సహా ఎవరికైనా ఇదే ఫార్ములా వర్తిస్తుంది. తదుపరి ఎన్నికలకు సిద్ధమవుతున్నామనే సంకేతం ఇచ్చేందుకే నిన్న ప్రధాని ఎన్డీఏ ముఖ్యమంత్రుల సమావేశంలో ఐదు గంటలు కూర్చున్నారు. ఇక్కడ మనమూ అదే సిద్ధాంతాన్ని అనుసరించాలి" అని స్పష్టం చేశారు.

**మళ్లీ రాష్ట్రం రావణ కాష్టమే**

వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టించటం, పరిమిత వనరుల కారణంగా అన్నీ సరిచేయటానికి సమయం పడుతోందని తెలిపారు. ఏ శాఖలోనూ సరైన ఆడిట్ జరగలేదన్నారు. కేంద్ర నిధులను కూడా ఇష్టానుసారం మళ్లించేశారని మండిపడ్డారు. మనం ఇప్పుడు ప్రవర్తించే విధానం వల్లే వచ్చే ఎన్నికల ఫలితాలు, మెజారిటీ ఆధారపడి ఉంటా యన్నారు. ఎన్ని అరాచకాలు చేయకపోతే 151 సీట్లు వచ్చిన వైసీపీ 11కి పడిపోయిందో ప్రతీ ఒక్కరూ గ్రహించాలని అన్నారు.

**గెలిచామని సరిపెట్టుకోవద్దు**

'గత ఐదేళ్లు సాగిన అరాచకం కారణంగా నాతో సహా, ప్రజలు, నేతలు అంతా ఇబ్బంది పడ్డారు. గెలిచాం కాబట్టి ఇక మన పని అపోయిందనుకుంటే చాలా ఇబ్బందులు ఉంటాయని గుర్తించాలి. యువత, విద్యావంతులు ఇలా దాదాపు 65 మంది కొత్త ఎమ్మెల్యేలు వచ్చారు. మంత్రుల్లో 18 మంది కొత్తవారే ఉన్నారు. ప్రతీ ఇంట్లోనూ చిన్నపాటి సమస్యలుండి సమన్వయం చేసుకున్నట్లే కుటుంబం లాంటి పార్టీలోనూ ఉండటం సహజం" అని చంద్రబాబు వెల్లడించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత ఆంధ్రప్రదేశ్ కు కలిపి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశానని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తాను సీఎంగా ఉన్న కాలంలో ఎన్నడూ రాష్ట్రంలో ఇలాంటి దుర్భర పరిస్థితుల్ని చూడలేదన్నారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేశారని విమర్శించారు. గత పాలకులు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా దారి మళ్లించి, రాష్ట్రం అభివృద్ధి చెందకుండా అడ్డుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో పార్టీని ముందుకెలా తీసుకెళ్లాలన్న దానిపై సమీక్షించాలని పార్టీ నేతలకు సూచించారు.అలాగే.. ప్రస్తుతం జాతీయ స్థాయిలో భాగస్వామ్యంగా ఉన్నామని, మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన ప్రాంతీయ పార్టీ టీడీపీ అని చెప్పారు. టీడీపీకి విశ్వసనీయత ఉందన్న చంద్రబాబు.. తాము అధికారం కోసం కాకుండా దేశం కోసం పనిచేశామని పేర్కొన్నారు. ఎన్డీయేతో పొత్తు పెట్టుకున్నప్పుడు కూడా తాము పదవులు అడగలేదన్నారు. కూటమి అధికారంలోకి రావడానికి క్యాడర్ చాలా త్యాగాలు చేసిందని, వారందరినీ అభినందిస్తున్నానని తెలిపారు. హర్యానాలో ఐదుగంటలపాటు జరిగిన ఎన్డీయే సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ రాబోయే ఎన్నికలకు సమాయత్తం కావాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు చెప్పారు. కేడర్ లో భారీ అంచనాలున్నాయని, అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.లిక్కర్ వ్యాపారంలో టీడీపీ ప్రజాప్రతినిధులు ఎవరూ జోక్యం చేసుకోవద్దని సీఎం హెచ్చరించారు. మద్యం వ్యాపారాలకు దూరంగా ఉండాలని పార్టీ నేతలను ఆదేశించారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం పూర్తిగా నష్టపోయిందని చెప్పారు. వైసీపీ హయాంలో చేసిన తప్పులే వారిని అధికారానికి దూరం చేసాయని అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వలనే బుడమేరు పొంగి విజయవాడకు వరదలు వచ్చాయని చెప్పారు. వరద బాధితులకు సాయం కోసం కష్టపడ్డామని చెప్పుకొచ్చారు. 2029లోనూ గెలుపు కోసం మిత్రపక్షాలతో సమన్వయం ఉండాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఈసారి ఏపీలో కరువుకు ఆస్కారం లేదన్నారు. కేంద్రం, ఏపీలో చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్చార్జులు, పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొన్నారు.

## దోచుకో, పంచుకో, తినుకో ప్రభుత్వం

- ఇంత వరకూ బడ్జెట్ లేదు
- ప్రతిపక్షంలో కూర్చుంటాం.. వెనుకాడం
- రాష్ట్ర వర్క్ షాప్ లో వైసీపీ అధినేత జగన్



**టీ మీడియా, అక్టోబర్ 18,విజయవాడ:** రాష్ట్రంలో పాలన, సంక్షేమం పూర్తిగా అస్తవ్యస్తమైందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో డీపీటీ మాత్రమే కనిపిస్తోందని, కూటమి పాలనలో డీపీటీ అంటే దోచుకో.. పంచుకో.. తీసుకో అన్న చందంగా మారిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేకపోయిందని, ఓటాన్ అకౌంట్తో ఇన్నాళ్లు నడిచే ప్రభుత్వం ఎక్కడా లేదని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఏర్పడి అయిదు నెలలు గడుస్తున్నా సూపర్ 6 లేదు, సూపర్ 7 లేదని దుయ్యబట్టారు. ప్రజలు నిలదీస్తారని భయపడి.. కనీసం బడ్జెట్ పెట్టలేని అసమర్ధ ప్రభుత్వం ఇదని మండిపడ్డారు. బడ్జెట్ ప్రవేశపెడితే సూపర్ -6 ఎక్కడ అని ప్రజలు అడుగుతారని భయం బాబును వెంటాడుతోందని అన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో మాదిరి.. బాబు అయిదు నెలల్లో డీబీటీ ఎక్కడా కనిపించలేదని పేర్కొన్నారు.

**చెడిపోయిన వ్యవస్థపై యుద్ధం మనది**

చెడపోయిన వ్యవస్థపై మనం యుద్ధం చేస్తున్నామన్నారు. వాళ్లు అబద్ధాలు సృష్టించి ప్రచారం చేస్తున్నారని.. మనం అంతకన్నా బలంగా తయారు కావాలని సూచించారు. పూర్తి సమన్వయంతో అందరూ కలిసి పని చేయాలని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తగిన సమయం ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలంగా ఉండాలని.. పార్టీ నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మనం ఇంట్లో కూర్చుంటే ఏమీ జరగదన్న జగన్.. చొరవ తీసుకుని అన్ని అంశాలపై స్పందించాలని చెప్పారు.

**ప్రతిపక్షంలో కూర్చోటానికి వెనుకాడం**

ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూసి ఉండమని.. నాలుగు నెలల్లోనే ఈ ప్రభుత్వం వద్దురా అని ప్రజలు చెప్పే పరిస్థితి వచ్చిందని మాజీ సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలు నిలదీస్తారని.. బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేకపోతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో కూర్చునేందుకు అయినా వెనుకాడం అని.. అబద్దాలు మాత్రం చెప్పలేమన్నారు. జగన్ తమకు పలావు పెట్టాడని.. చంద్రబాబు బిర్యానీ పెడతానని చెప్పి మోసం చేశాడని ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పుడు ఉన్న పలావు పోయిందని.. బిర్యానీ లేదని అనుకుంటున్నారని అన్నారు.

**వసూళ్లకే పోటా పోటీ**

ఈ ప్రభుత్వంలో మద్యం గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు జగన్. మద్యం షాపుల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు 30 శాతం ఇస్తావా.. 40 శాతం ఇస్తావా.. అని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మద్యం షాపుల కోసం కిడ్నాప్‌లు కూడా చేస్తున్నారని.. నిజంగా లిక్కర్ పాలసీలో దురుద్దేశాలు లేకపోతే ఎమ్మెల్యేలు ఎందుకు పోటీ పడుతున్నారని ప్రశ్నించారు. లిక్కర్ రేట్లు తగ్గిస్తామని చెప్పినా.. రేట్లు అలాగే ఉన్నాయన్నారు.

**కష్టాలు.. నష్టాలు సాధారణం**

"కష్టం లేనిదే మనకు అందలం రాదు. 16 నెలలు నేను జైలుకు పోతేనే ముఖ్యమంత్రి అయ్యాను. ఎవరూ చూడని వేధింపులు నేను చూశాను. అకారణంగా 16 నెలలు ఒక వ్యక్తిని జైల్లో పెట్టడం అన్నది ఎప్పుడూ జరగలేదు. ఒక పార్టీ లేకుండా చేయాలని, ఒక వ్యక్తిని వేధించాలన్న ఉద్దేశంతోనే ఆ స్థాయి వేధింపులు చేశారు. అన్ని నెలలు జైల్లో పెట్టిన తర్వాత, ముఖ్యమంత్రి స్థానంలోకి వచ్చి ప్రజలకు మంచి చేసే అవకాశం దేవుడు ఇచ్చాడు. మనం మంచి చేయగలిగాం. దాని అర్థం అన్యాయం జరిగినప్పుడు ఒక మంచి జరుగుతుంది. చీకటి తర్వాత వెలుగు వస్తుంది. దేవుడు మంచికి తోడుగా ఉంటాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు వస్తాయి. నష్టాలుంటాయి. ఒక్కోసారి జైలుకు కూడా పోవాల్సి ఉంటుంది. అయితే ఏంటి? ఇవన్నీ జరిగినప్పుడే మనిషి ఎదుగుతాడు. ప్రజల్లోనూ, నాయకత్వం దగ్గర మన్ననలు ఉంటాయి. అన్నీ ఎదుర్కోవడానికి సిద్ధపడాలి. మన భవిష్యత్ కోసం మనం చేస్తున్నామని గుర్తు పెట్టుకొండి. మన పార్టీ కోసం, మనం అధికారంలోకి రావాలన్న సంకల్పంతో పేదవాడికి మన వల్ల మంచి జరుగుతుందన్న స్థిరమైన నమ్మకంతో అడుగులు వేస్తున్నాం. ఈ విషయం ప్రతి ఒక్కరూ మనసులో పెట్టుకొండి. ఈ విషయాలను కచ్చితంగా అందరూ గుర్తు పెట్టుకోవాలి.." అని మాజీ సీఎం జగన్ సూచించారు.

## హాట్ టాపిక్‌గా మారిన దుబ్బాక రాజకీయం

### -చిచ్చురేపుతోన్న ప్రోటోకాల్ రచ్చ

**టీ మీడియా,అక్టోబర్ 18, దుబ్బాక :**ఈ మధ్య కాలంలో నియోజకవర్గ రాజకీయం ఎప్పుడు హాట్ టాపిక్ గానే ఉంటుంది. అక్కడ ఉన్న మూడు పార్టీల నేతలు ఢీ అంటే ఢీ అని వ్యవహరిస్తూ. ఎవరికి వారు తగ్గేదేలే అన్నట్లుగా మారడంతో ఆ నియోజచర్గంలో నిత్యం ఏదో ఒక రచ్చ నడుస్తూనే ఉంది. తాజాగా ప్రోటోకాల్ రచ్చతో మరోసారి

4లో..

## పంజాబ్ రైతుల ఆందోళనలు

### -చర్చలకు ఆహ్వానించిన సిఎం

**టీ మీడియా,అక్టోబర్ 18,చండీగఢ్ :** పంజాబ్‌లో వరి ధాన్యపు సేకరణ ఆలస్యమైంది. దీంతో ఆ రాష్ట్ర రైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం సేకరణ ఆలస్యమైనందుకు రైతులు ఆందోళన బాటపట్టారు. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లు, కమిషన్ ఏజెంట్స్ ఆ రాష్ట్ర రాజధాని చండీగఢ్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే పలువురు రైతు నేతల్ని నగర శివార్లలోనే పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పోలీసుల నిర్బంధాల మధ్యే కొంతమంది రైతు నేతలు రాజధానిలో సెక్టార్ 35లోని కిసాన్ భవన్‌కు చేరుకున్నారు. దీంతో ఈ

4లో..

## ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు

4లో..

## స్కిల్ యూనివర్సిటీ కి ఆదాని రూ. 100 కోట్లు విరాళం

4లో..

## రాష్ట్ర హెూదా కోరుతూ

### జమ్ముకశ్మీర్ మంత్రిమండలి తీర్మానం



**టీ మీడియా, అక్టోబరు 18, శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హెూదాను ఇవ్వాలని కోరుతూ ఆ రాష్ట్ర మంత్రి మండలి గురువారం తీర్మానం చేసింది. కేంద్ర పాలిత ప్రాంత సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం చేసిన మరుసటి రోజే మంత్రి మండలి తీర్మానం చేసింది. ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలో గురువారం క్యాబినెట్ భేటీ జరిగింది. కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై గురువారం రాత్రి వరకు ఆ సర్కారు ఎటువంటి వివరాలను వెల్లడించారు. శ్రీనగర్‌లోని సచివాయంలో ఆ మీటింగ్ జరిగింది. తీర్మానాన్ని ఏకపక్షంగా ఆమోదించారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను ఇవ్వాలంటూ కేంద్రాన్ని కోరారు. ఈ విషయంపై ప్రధాని మోదీతో చర్చించేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా ఢిల్లీ వెళ్లనున్నారు. ఆ పర్యటనలో తీర్మానాన్ని ఆయన ప్రధానికి అందజేయనున్నారు.

## సుప్రీంకోర్టు విచారణలన్నీ లైవ్ టెలీకాస్ట్



- వాద ప్రతివాదనలు, తీర్పులు చూడొచ్చు
- అధికారికంగా ప్రకటించిన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్
- ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తున్నాం
- సక్సెస్ కాగానే అందుబాటులోకి

**టీ మీడియా,అక్టోబర్ 18, న్యూ ఢిల్లీ :**భారత న్యాయ చరిత్రలో మరో ముందడుగు పడింది. సుప్రీంకోర్టులోని అన్ని బెంచ్‌లలో జరిగే వాదనలు ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చీఫ్ జస్జిస్ డీవై చంద్రచూడ్ శుక్రవారం ప్రకటించారు. దీనికోసం కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో ఈ ప్రయోగాత్మక పరిశీలన చేయబోతున్నట్లు తెలిపారు. లోటుపాట్లు సవరించి.. త్వరలోనే అధికారికంగా సుప్రీంకోర్టులోని అన్ని బెంచ్‌లలో జరిగే వాదనలు, తీర్పులు ప్రజలు ప్రత్యక్ష ప్రసారంలో చూసేలా అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

**సుప్రీంకోర్టు సొంత పోర్టల్..**

కాగా, ఇవాళ ఒక టెస్ట్ ఫార్మాట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయగా యూట్యూబ్ చానెల్‌కు బదులుగా కోర్టుకు చెందిన సొంత అప్లికేషన్‌పై లైవ్ ప్రసారం చేశారు. ఇది సక్సెస్ కావడంతో త్వరలో లైవ్ ప్రసారాలకు రంగం సిద్ధం చేస్తున్నట్టు చీఫ్ జస్టిస్ తెలిపారు. ఇదిలా ఉంటే 2022 నుంచి రాజ్యాంగ ధర్మాసనం ప్రజా ప్రాముఖ్యత కలిగిన కేసు వాదనలు, తీర్పులను మాత్రమే ప్రజలు వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. అప్పట్లో సర్వోన్నత న్యాయస్థానం విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రారంభించిన తొలి రోజు 8 లక్షల మంది చూశారు.

**పలు కేసులపై ప్రజల ఆసక్తి**

ఇటీవల నీట్-యూజీ విషయంలో ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ విచారణలు, ఆర్జీ కర్ హస్పటల్ లో జూనియర్ డాక్టర్ హత్యకు సంబంధించి సుమోటోగా స్వీకరించిన కేసును కూడా ప్రజా ప్రయోజనాల పరిగణనలోకి తీసుకుని ప్రత్యక్ష ప్రసారం చేసింది. దీనికి కూడా మంచి వ్యూస్ లభించాయి..

## అఖిలప్రియ వర్సెస్ ఏవీ సుబ్బారెడ్డి

- పేలుతున్న డైలాగుల డైనమేట్లు
- ఆళ్లగడ్డలో హైటెన్షన్!



**టీ మీడియా,అక్టోబర్ 18, ఆళ్లగడ్డ :** ఫ్యాక్షన్ గడ్డ అయిన ఆళ్లగడ్డ మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. అఖిలప్రియ వర్సెస్ ఏవీ సుబ్బారెడ్డి మధ్య డైలాగుల డైనమేట్లు ఓరేంజ్‌లో పేలుతున్నాయి. ఆళ్లగడ్డ వదిలివెళ్లాలని ఏవీకి అఖిలప్రియ మాస్ వార్నింగ్ ఇస్తే.. ఏం జరిగినా ఆళ్లగడ్డలోనే తేల్చుకుంటానంటూ కౌంటర్ ఎటాక్‌కి దిగారు ఏవీ సుబ్బారెడ్డి. ఇక ఇద్దరి మధ్య పవర్ ఫుల్ డైలాగులతో ఆళ్లగడ్డలో హైటెన్షన్ నెలకొంది.అఖిల ప్రియ ఆన్ ఫైర్..! పెద్దోళ్లైనా, బంధువులైనా నో కాంప్రమైజ్ అంటున్నారు. తేడా వస్తే రచ్చ రచ్చ చేస్తున్నారు. మేనమామ అయిన విజయ డైయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డితో మొన్న తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఫోన్‌లోనే పబ్లిక్‌గా మాటల తూటాలు పేల్చారు. లేటెస్ట్‌గా మాజీ మంత్రి ఏవీ సుబ్బారెడ్డిపై ఆగ్రహావేశాలు వెల్లగక్కారు. ఊరు వదిలివెళ్లిపోవాల్సిందేనంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది అఖిల ప్రియ వ్యవహారం. ఇటు ఆళ్లగడ్డలోనూ హైటెన్షన్ వాతావరణం నెలకొంది.ఆళ్లగడ్డ నా అడ్డా అంటున్నారు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ. ఏవీ సుబ్బారెడ్డిపై ఓరేంజ్‌లో విరుచుకుపడుతున్నారు. తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే.. వెంటనే ఆళ్లగడ్డను వదిలేసి వెళ్లిపోవాల్సిందేనంటూ అల్టిమేటం జారీ చేశారు. అంతేగాక, పోలీసులతోనూ సుబ్బారెడ్డిపై ఒత్తిడి చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటు ఏవీ సుబ్బారెడ్డి సైతం ఏమాత్రం తగ్గేదేలే అంటున్నారు. నేనెందుకు ఆళ్లగడ్డ నుంచి వెళ్లిపోవాలి%ౌ%? నాకు ఒకరు చెప్పేదేంటి%ౌ%? ఏం చేస్తారో చూస్తా%ౌ% ఆళ్లగడ్డలోనే తేల్చుకుంటానంటూ ఏవీ కూడా ఓరేంజ్‌లో అఖిలప్రియపై ఫైర్ అవుతున్నారు. నేనెందుకు ఊరు వదిలి వెళ్లాలి%ౌ%? ఏం చేశానని వెళ్లమంటున్నారంటూ%ౌ%? నిప్పులు చెరుగుతున్నారు.ఇక ఇద్దరి మధ్య డైలాగ్ వార్ పీక్స్‌కి చేరడంతో రంగంలోకి దిగారు పోలీసులు. ఏవీ సుబ్బారెడ్డిని కాంప్రమైజ్ చేసే పనిలో పడ్డారు. టెన్షన్ వద్దు వెళ్లిపోండంటూ ఏవీకి పోలీసులు చెబుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఏవీ ఏమాత్రం తగ్గనంటున్నారట. ఏం జరుగుతుందో చూస్తానంటున్నారట ఏవీ సుబ్బారెడ్డి. దీంతో ఆళ్లగడ్డలో హైటెన్షన్ నెలకొంది. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఇద్దరిపైనా నిఘా పెట్టారు. మొన్నటికి మొన్న విజయ డెయిరీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డికి వార్నింగ్ ఇచ్చారు అఖిలప్రియ. డెయిరీకి వెళ్లి మరీ జగన్ ఫోటో తీసేసి చంద్రబాబు ఫోటోను పెట్టారు. డెయిరీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఫైర్ అయ్యారు.ఇలా రోజుకొకరిపై విరుచుకుపడుతున్నారు ఎమ్మెల్యే అఖిలప్రియ. విజయ డైరీ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డికి వార్నింగ్ ఇచ్చినా 24 గంటలు గడవకముందే.. ఏవీ సుబ్బారెడ్డికి ఆళ్లగడ్డ వదిలి వెళ్లాలంటూ అల్టిమేటం జారీ చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అసలు ఆళ్లగడ్డలో ఏం జరుగుతుందోన్న చర్చ పొలిటికల్ సర్కిల్ రచ్చ లేపుతోంది.మరోవైపు, వైసీపీ నేత, విజయ మిల్క్ డైరీ చైర్మన్, ఎస్వీ జగన్మోహన్ రెడ్డికి భూమా జగత్ సైతం మాస్ వార్నింగ్ ఇచ్చారు. అక్క అఖిల ప్రియ గురించి ఏ ఒక్క మాట జారిన పరిణామాలు సీరియస్‌గా ఉంటాయని హెచ్చరించారు. విజయ డైరీలో జరుగుతున్న అక్రమాలు మొత్తం తెలుసన్న జగత్, త్వరలోనే ఎస్వీ జగన్ బండారం బయటపెడతానన్నారు.ఇదిలావుంటే, నిన్న మధ్యాహ్నం ఆళ్లగడ్డలో తన ఇంటికి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టేందుకు సిద్ధమైన ఏవీ సుబ్బారెడ్డి పోలీసుల సూచనల మేరకు విరమించుకున్నారు. ఆపై ఏవీ సుబ్బారెడ్డి ఆళ్లగడ్డలో ఉండటానికి వీలు లేదంటూ ఎమ్మెల్యే అఖిలప్రియ వార్నింగ్ ఇచ్చారు. అయితే తాను ఆళ్లగడ్డను వీడి వెళ్లబోనంటూ ప్రకటించారు ఏవీ సుబ్బారెడ్డి. ఈ క్రమంలో టెన్షన్ వాతావరణం కొనసాగుతోంది. ఆళ్లగడ్డ పరిణామాలపై ఇవాళ్టి ఎమ్మెల్యేల సమావేశంలో ఆరా తీయబోతున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. ఇద్దరి మధ్య వివాదంతో ప్రజలు ఆందోళనకు గురయ్యే పరిస్థితి తీసుకురావద్దంటున్నారు పార్టీ పెద్దలు. భూమా అఖిలప్రియ, ఏవీ సుబ్బారెడ్డి మధ్య కొన్నేళ్లుగా వివాదం రాజుకుంది. ఘర్షణలు, పరస్పరం హత్యాయత్నం కేసులు సాధారణంగా మారాయి.

# పత్తిని ఆరబెట్టాకే..కేంద్రాలకు తేవాలి

**-కలెక్టర్ రాజర్షి షా**



**టీ మీడియా, అక్టోబర్ 18,ఆదిలాబాద్** :రెట్కతులు పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేటప్పుడు ఆరబెట్టి తేవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి తేమ శాతం నిర్ధారణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పత్తి తేమ శాతం నిర్ధారణపై శిక్షణ కార్యక్రమంలో ఐకెపి, మార్కెట్ కమిటీ సిబ్బంది కి దిశా నిర్దేశం చేశారు. తేమ శాతాన్ని నిర్ధారించే మిషన్ తో మూడు రకాల పత్తి (ఒకటి కుప్పలుగా వేసిన పత్తి, రెండు ఉదయం 6.00 గంటల నుండి 9.00గంటల వరకు, మూడు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సేకరించిన పత్తిని మూడు విభాగాలుగా మిషన్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెట్కతులు పండించిన పత్తిని 8 శాతం తేమ మించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాల కు తీసుకు రావాలని, ఇంటివద్ద నుండి తెచ్చేటప్పుడు పత్తిని ఆరబెట్టి తేవాలని సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల సమయంలో సేకరించిన పత్తి తేమ శాతం తక్కువగా ఉంటుందని, మరుసటి రోజు కొనుగోలు కేంద్రాలకు తెచ్చేటప్పుడూ ఇంటి వద్ద ఆరబెట్టి తీసుకువస్తే తేమ లేకుండా ఉంటుందని అన్నారు.

పత్తి నిర్ధారణపై అవగాహన కలిగి ఉండాలి..

మిగితా రెండు రకాలు కుప్పలుగా పోసి రెండు, మూడు రోజులైన పత్తి, అలాగే ఉదయం 6.00 గంటల నుండి 9.00 గంటల వరకు సేకరించిన పత్తి మరుసటి రోజు కేంద్రాలకు తేవడం జరుగుతుందన్నారు. కావున తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, మిషన్ ద్వారా తను పరీక్షించి, శిక్షణ తీసుకుంటున్న సిబ్బంది ప్రతీ ఒక్కరూ మిషన్ ద్వారా పత్తి నిర్ధారణపై అవగాహన కలిగి ఉండాలని, కోనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రెట్కతులు కొనుగోలు కేంద్రాలకు రాగానే వారికి టోకెన్స్ ఇవ్వాలని, రెట్కతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేటపుడు విడి గా పొడి పొడిగా తీసుకురావాలని, దీని వలన పత్తి నాణ్యత పెరుగుతుందని, రైతులందరూ ఒకేసారి కాకుండా దశల వారిగా కేంద్రాలకు తేవాలని, పత్తి పూర్తిగా ఆరిన తరువాతనే అమ్మకానికి తేవాలని, నీళు చల్లిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని, కావున రెట్కతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి పత్తి ఆరిన తరువాత కోనుగోలు కేంద్రాలకు తెచ్చే విధంగా వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. పత్తి పంటకు ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూపాయలు రూ.7521 నిర్ణయించడం జరిగిందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది తేమ శాతం నిర్ధారణ పై క్షేత్ర స్థాయిలో పూర్తి అవగాహన చేసుకొని, కోనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా వచ్చే 150 రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు సేకరణ పూర్తి స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా విజయంతం చేయలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి గజనన్, ఐకేపీ, సీసీఐ, సిబ్బంది ఉన్నారు.

# దీపావళికి డీఏలు వెంటనే చెల్లించాలి: ఎం.ఏ.ఖాద్రీ



**టీ మీడియా, అక్టోబర్ 18,శంకరపట్నం:**ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన 4 డీ ఏ లను దీపావళి పండుగ సందర్భంగా తక్షణమే ప్రకటించాలని లేని ఎడల ఉద్యమించాల్సి వస్తుందని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ,గత సంవత్సరం 2022 జులై నుంచి 2024 జనవరి వరకు మొత్తం 4 డీ ఏ లు బకాయిలు ఉండగా కేంద్ర ప్రభుత్వం మరో డీ ఏ 3'/, ను కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వెంటనే మన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అనుసరించిడం లేదో అర్థం కావట్లేదన్నారు. ఇప్పుడైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయకుండా పెండింగ్ లో ఉన్న 5 డీఏ లు ఇచ్చి సప్లిమెంటరీ బిల్లులు,సరెండర్,మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, ఫైనల్ పేమెంట్, లోన్లు సకాలంలో వచ్చేటట్లు వెంటనే ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపైన తగు నిర్ణయాలు తీసుకోని అమలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను పెడచెవిన పెట్టిందనే విషయం ఈ ప్రభుత్వానికి బాగా తెలుసని అన్నారు.ఆ పరిస్థితులు తిరిగి పునరావృతం కాకుండా వెంటనే స్పందించి తగు నిర్ణయాలు తీసుకొని ఒక నిర్దిష్ట కాలపరిమితిలో ఇచ్చేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలపై దృష్టి సారించి సగటు ఉద్యోగికి లాభం చేకూరేలా చూడాలని అయన అన్నారు

# అదనపు కలెక్టర్‌ను ఆత్మహత్య కేసు..

## -సీపీఎం నాయకురాలిని పదవి నుంచి తొలగింపు



**టీ మీడియా,అక్టోబర్ 18,తిరువనంతపురం:** అదనపు జిల్లా కలెక్టర్‌ను ఆత్మహత్యకు పురిగొల్పినట్లుగా సీపీఎం నాయకురాలిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆమెను పార్టీ పదవి నుంచి తొలగించారు. వామపక్ష పార్టీ అధికారంలో ఉన్న కేరళలో ఈ సంఘటన జరిగింది. కన్నూర్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ (ఏడీఎం) నవీన్ బాబు మరి కొన్ని నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సొంత జిల్లా పతనంతిట్టకు ఆయన బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అక్టోబర్ 14న వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కాగా, ఎలాంటి ఆహ్వానం లేకపోయినా కన్నూర్ జిల్లా పంచాయతీ అధ్యక్ష్యురాలైన పీపీ దివ్య, ఏడీఎం నవీన్ బాబు వీడ్కోలు కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా ఆయనపై అవినీతి ఆరోపణలు చేసింది. చెంగలైలో పెట్రోల్ బంక్‌కు అనుమతి ఇవ్వకుండా చాలా నెలలు ఆయన జాప్యం చేసినట్లు విమర్శించింది. ఈ ఆరోపణలపై నవీన్ బాబు మనస్తాపం చెందారు. క్వాటర్స్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.మరోవైపు నవీన్ బాబును ఆత్మహత్యకు పురిగొల్పినట్లుగా దివ్యపై ఆరోపణలు వచ్చాయి. ఆమెపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కేరళలోని ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ డిమాండ్ చేశాయి. ఈ నెల 17న దివ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సీపీఎం చర్యలు చేపట్టింది. పార్టీ పదవి నుంచి దివ్యను తొలగించినట్లు గురువారం రాత్రి ప్రకటించింది. కన్నూర్ జిల్లా పంచాయతీ అధ్యక్షురాలి బాధ్యతలను న్యాయవాది కేకే రత్నకుమారికి అప్పగించినట్లు పేర్కొంది.కాగా, ఏడీఎం నవీన్ బాబు మరణం పట్ల దివ్య కూడా సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేసింది. తాను కేవలం మంచి ఉద్దేశంతోనే అవినీతిపై వ్యాఖ్యలు చేసినట్లు తెలిపింది. పోలీసుల విచారణకు సహకరిస్తానని చెప్పింది. న్యాయపరమైన మార్గాల ద్వారా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని తెలిపింది. పోలీస్ దర్యాప్తు నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకే ఆ పదవికి రాజీనామా చేసినట్లు దివ్య వెల్లడించింది.

# పిడుగుపాటుకు ఇద్దరు కూలీలు మృతి



**టీ మీడియా,అక్టోబర్ 18,పిచ్చా టూరు (తిరుపతి జిల్లా):** పిచ్చాటూరు మండలంలోని హనుమంతపురం పంచాయతీ లో శుక్రవారం పిడుగు పడి ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలో హనుమంతపురం ఏ ఏ డబ్ల్యు కు చెందిన మణి (54), రాము (59) మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వీరిద్దరూ దామోదరం వారి పొలానికి కూలి పనికి వెళ్లగా.. అక్కడ పొలంలో వారిపై పిడుగుపడగా వారు చనిపోయారని సమాచారం. మణికి ముగ్గురు కుమారులు భార్య కాంతమ్మ ఉన్నారు. ఇక రాముకి ఒక కుమార్తె భార్య కృష్ణమ్మ ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బహుళ అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం

## -ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు



**టి మీడియా, అక్టోబర్ 18, న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదం వల్ల ఇద్దరు మృతి చెందారు. నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం 5.50 గంటల సమయంలో ఢిల్లీలోని భోలానాథ్ నగర్‌లోని 11వ నెంబర్ వీధిలో బహుళ అంతస్తుల భవనంలో హౌస్ నెంబర్ 197 రూమ్‌లో మంటలు చెలరేగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసు, అగ్నిమాపక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఆ భవనంలో మూడో అంతస్తులో ఉన్న మనీష్ గుప్తా ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక బృందం గుర్తించింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వారు గాయాలపాలయ్యారని, ఎగసిపడిన మంటలు వల్ల వచ్చిన పొగ వల్ల ఊపిరాడక ఇద్దరు మృతి చెందారని డిసిపి షహదర మీడియాకు వెల్లడించారు. మృతులను షిల్పి గుప్తా (42), ప్రణవ్ గుప్తా (19)లుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో గాయపడిన కైలాష్ గుప్తా (72), భగవతి గుప్తా (70), మనీష్ గుప్తా (70), పార్థ్ గుప్తా (19)లను జిటిబి ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నిప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



# పోలీస్ స్టేషన్‌లోనే ఒంటికి నిప్పు

## - కాపాడబోయిన పోలీసులకు గాయాలు!

**టి మీడియా, అక్టోబర్ 18,పాలకుర్తి:**జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడే సంఘటన జరిగింది. భార్యాభర్తల పంచాయతీలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి అక్కడే ఒంటిపై పెట్రోల్ పోసుకొని పట్టించుకున్నాడు. అతన్ని అడ్డుకుబోయిన పోలీసులకు ఆ నిప్పు%శీ%టుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో స్పందించిన తోటి సిబ్బంది హుటాహుటీన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.పాలకుర్తి మండలం కొండాపురం గ్రామ శివారు మేకలతండాకు చెందిన లాకవత్ శీను %-% అతని భార్య రాధిక మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు చెలరేగుతున్నాయి. భర్త వేధింపులు భరించలేక మనోవేధన గురైన రాధిక పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శ్రీనును పోలీసులు పాలకుర్తి పోలీస్ స్టేషన్ పిలిపించారు. భార్యాభర్తలిద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రములో ఒక్కసారిగా ఊగిపోయిన శ్రీనివాస్ తన వాహనంలోని పెట్రోలు తీసి తన ఒంటిపై కోసుకున్నాడు. అంతటితో ఆగకుండా వెంటనే నిప్పంటించుకున్నాడు.అయితే ఇదంతా పోలీసుల ముందే జరగడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. కాపాడబోయిన ఎస్సై సాయి ప్రసన్నకుమార్, కానిస్టేబుల్ రవీందర్‌కు ఆ మంటలు అంటుకున్నాయి. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కానిస్టేబుల్ రవీందర్ చేతులు, కాళ్ళకు నిప్పు అంటుకుంది. గాయాలపాలైన శ్రీనుతోపాటు ఇద్దరు పోలీస్ సిబ్బందిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పాలకుర్తి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శీను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# దేశ ముఖచిత్రాన్ని మార్చేది విద్యనే

## -మంత్రి సీతక్క



**టి మీడియా, అక్టోబర్ 18,హైదరాబాద్ :** సారం లేని భూమి.. విద్య లేని జీవితం ఒక్కటేనని, దేశ ముఖచిత్రాన్ని మార్చేది విద్యనే అన్నారు రాష్ట్ర మంత్రి సీతక్క. ఇవాళ గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో హైసా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ విద్య సదస్సులో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించేందుకు సమావేశమైనందుకు అభినందనలు తెలిపారు. మనిషి జీవితంలో విద్య అనేది చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు.సమాజంలో ఇంకా అంతరాలు ఉన్నాయి. విద్యా బోధనలో కూడా అంతరాలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యా అవకాశాల్లో ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా ఉందన్నారు. పట్టణ ప్రాంతాలకు మెరుగైన విద్య అందుతుందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడలేకపోతున్నారు. అందుకే విద్యలో ఉన్న అంతరాలను తొలగించాలని సీతక్క పేర్కొన్నారు. సమానత్వ సాధన దిశలో విద్య కీలక పాత్ర పోషిస్తుందన్నారు. హైదరాబాద్‌లో ఎలాంటి ఎడ్యుకేషన్ ఉందో, మరుమూల పల్లెలో అలాంటి విద్య ఉండాలని తెలిపారు.ఆ దిశలోనే తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గ్రామీణ విద్యార్థులకు అవకాశం కల్పిస్తే బాగా రాణిస్తారన్నారు. కానీ వారికి అవకాశాలు, వస్తువులు లేక వెనుకబాటుతనానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి కేంద్రీకరణ జరగాలి, అప్పుడే అందరికీ సమాన అవకాశాలు అందుతాయన్నారు. అప్పుడు సమాజంలో పోరాటాలు ఉండవు, అందుకే అభివృద్ధి కేంద్రీకరణ కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఒక మంచి పని చేస్తే జీవితంలో గొప్ప ఆనందం, అనుభూతి మిగులుతుందని సీతక్క వెల్లడించారు.

# పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**టి మీడియా, అక్టోబర్ 18,దేవరకద్ర:**నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం లోని శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన పరిధిలో బ్రహ్మోత్సవాలపై జిల్లా కలెక్టర్ శ్రీమతి. విజయేందిర బోయి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించాలని కోరారు. ముఖ్యంగా సెప్టెంబర్ 6 నాడు అలంకారం మరియు సెప్టెంబర్ 8 నాడు ఉద్దాల ఉత్సవం రోజు ప్రజలు లక్షలాదిగా తరలి వస్తారని, దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని, క్యూ లైన్ ల వద్ద, పార్కింగ్ వద్ద పటిష్టమైన బారికేడ్ల వ్యవస్థ ఏర్పాటు చేయాలని, మంచినీటి కొరత లేకుండా చూడాలని, కరెంట్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించాలని, శానిటేషన్ పకడ్బందీగా నిర్వహించాలని, మహాలక్ష్మీ ఉచిత బస్సు సౌకర్యం దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం ఎక్కువ బస్సులు నడపాలని, ముఖ్యమైన రహదారులు వెడల్పు చేసి, రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని, చైన్ స్నాచింగ్, పిక్ పాకెటర్లను దృష్టిలో పెట్టుకొని పకడ్బందీ పోలీస్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఈవ్ టీజింగ్ దృష్టిలో ఉంచుకొని షీ టీంలు ఏర్పాటు చేయాలని, వీఐపీలకన్న సామాన్య భక్తులకే ప్రాధాన్యమివ్వాలని, భక్తులకు ఎలాంటి లోటు లేకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అధికారులు ఆదేశించారు.

# ఆదివాసీ గూడాల్లో గుస్సాడి పండుగ..


## -గిరిజనులంతా కలిసినృత్యాలు



**టి మీడియా, అక్టోబర్ 18,ఆదిలాబాద్** :ఆదివాసీ గూడాల్లో అంగరంగ వైభవంగా దండిగా సాగే దండారి పండుగ సంబరం మొదలైంది. డప్పుల దరువులు , గజ్జెల మోతలు , గుస్సాడీ నృత్యాలతో అడవి తల్లి మురిసి పోనుంది. దండారి అంటేనే ఆదివాసీ గూడేల్లో సంబరాల వేడుక. యేటా ఆదివాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవత 'ఏత్మాసార్ పేన్' పేరిట చేసే ప్రత్యేక పండుగతో దండారి పండుగ ప్రారంభమవుతుంది. దీపావళికి ముందు భోగి పండుగతో ప్రారంభమై.. కొలబొడితో పండుగ ముగిస్తుంది. పక్షం రోజుల పాటు సాగే ఈ వేడుక తరతరాల సంప్రదాయాన్ని కొనసాగించే అద్భుత పండుగగా నిలుస్తోంది. అడవి తల్లి ఒడిలో అంగరంగవైభవంగా సాగే దండారి పండుగ ఆచారాలు , వ్యవరాలు , సంస్కృతి , సంప్రదాయాలు.. కట్టుబొట్టు రూపాలేంటో మీరు ఓ సారి తెలుసుకోవాలనుకుంటే ఆదివాసీల ఖిల్లా అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ వచ్చేయండి.ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా తుడుం మోతలు, డప్పుల చప్పుల్లు , గుస్సాడీ నృత్యాల ఆటపాటలే కనువిందు చేస్తాయి. తరతరాల సంప్రదాయాన్ని తూచ తప్పకుండా పాటించే సంస్కృతి సంప్రదాయాల పుట్టినిళ్లుగా నిలుస్తూ ఆదివాసీ గూడాలు రారమ్మంటూ స్వాగతం పలుకుతాయి. డప్పుల దరువులు, గజ్జెల మోతలు, గుస్సాడీల నృత్యాలతో గూడేలన్నీ మారుమోగుతాయి. ఓ వైపు కోలాటాలు, మరోవైపు గోండిపాటల నృత్యాలు, హాస్యనాటికల ప్రదర్శనలు అబ్బురపరుస్తాయి. ఆశ్వీయుజ పౌర్ణమి అనంతరం ప్రారంభమయ్యే ఈ వేడుకలు పక్షం రోజుల పాటు అంగరంగవైభవంగా సాగుతాయి. తెలంగాణ ప్రభుత్వం దండారిని ప్రత్యేక పండుగగా కూడా గుర్తించింది. దండారి పండుగ వేళ చేసే గుస్సాడీ నృత్యాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును పొందాయి. ఈ పండుగలో ఆదివాసీల కట్టుబొట్టు ఎంత అద్భుతంగా ఉంటుందో.. పండుగ వేళ చేపట్టే దీక్ష అంత అత్యంత కఠినంగా ఉంటుంది.దండారి వేడుకల్లో గుస్సాడీలదే కీలక పాత్ర. వారి వేశాదరణ ఆకట్టుకుంటుంది. నెత్తిపై నెమలి పించం.. ఆ పించానికి ఇరు వైపులా దుప్పి కొమ్ములు.. పించం మధ్యలో తలుక్కున మెరిసి అద్దం.. భుజానికి జింక తోలు, నడుము, కాళ్లకు గల్లుగల్లున మోగే గజ్జెలు, మెడలో శివయ్య రుద్రాక్షమాల.. ఒంటి నిండా బూడిద.. ముఖానికి నల్లని రంగు.. ఇలా విచిత్ర వేసాదారణతో కనిపించి వీరిని గురు అని.. ఆదివాసీ దేవుని ప్రతిరూపమని పిలుస్తారు.

# అమెరికాలో తెలుగువాడి అరెస్ట్..

## -ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న బాగోతాలు..!



**టి మీడియా, అక్టోబర్ 18,హైదరాబాద్ బ్యూరో:**పెద్దమనిషిగా చెలామణి అయ్యాడు. తెలుగు వారికి అండగా నిలిచానన్నాడు. అంతా తానై ఉంటానంటూ భరోసా ఇచ్చాడు. ఇదంతా నిజమేనని నమ్మారు తెలుగువారు. ఇన్నాళ్ల తర్వాత అసలు రంగు తెలిసి అవాక్కయ్యారు. ఛీ. ఇంతటి నీచుడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అమెరికా వర్జీనియాలో తెలుగు వ్యక్తి ఫణి తాళ్లూరిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ బాలికపై పలుమార్లు లైంగికదాడికి తెగబడినట్లు వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లైంగికదాడితోపాటు నగ్నఫొటోలతో బెదిరించినట్లు బాధితురాలు ఆరోపించింది. వేధింపులు భరించలేక తల్లిదండ్రులతో కలిసి పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటకు వచ్చింది. 2022 నుంచి దర్యాప్తు చేపట్టిన అమెరికా పోలీసులు తాజాగా ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఫణి తాళ్లూరి అడల్ట్ డిటెన్షన్ సెంటర్‌లో ఉన్నాడు.అమెరికా చట్టాల మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడితే రాజీలతో ప్రమేయం లేకుండా సదరు నిందితులపై చట్ట ప్రకారం కోర్టుల ద్వారా విచారణ చేపట్టి శిక్ష విధిస్తారు. ఫణి తాళ్లూరిపై వస్తున్న ఆరోపణలు అన్ని రుజువైతే ఆయనకు 60ఏళ్లు శిక్ష పడే అవకాశముంది. అమెరికాలో లైంగికదాడి కేసులో తెలుగువాడి అరెస్టు కలవరం పుట్టించింది. తెలుగు కమ్యూనిటీలో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. ఫణి బాధితులు చాలామందే ఉన్నారనే చర్చ కొనసాగుతోంది. పదుల సంఖ్యలో మైనర్లపై ఫణి అఘాయిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నా.. బయటకు వచ్చింది ఒక్కరే అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఫణి తాళ్లూరు అసలు రంగు ఇప్పటికైనా బయట పడిందంటున్నారు ఎన్నారై లు. విరాళాల పేరుతో, సమాజ సేవ చేస్తున్నట్టు బిల్డప్ ఇస్తూ పెద్దమనిషిగా చలామణి అయ్యారని ఆరోపించారు. లైంగికదాడులతో ఫణి అసలు రంగు తెలియడంతో షాక్‌కు గురయ్యారు. తెలుగువారు ఎక్కువగా ఉండే 'వర్జీనియా యాష్‌బర్న్' ప్రాంతంలో ఫణి తాళ్లూరి బాధితులు ఇంకా ఎందరున్నారు..? వాళ్లు కూడా నోరు విప్పుతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

# జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా అన్నయ్య గౌడ్



**టి మీడియా, అక్టోబర్ 18,పెద్దపల్లి :**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంతటి అన్నయ్య గౌడ్ ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ లైబ్రరీస్ వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.అన్నయ్య గౌడ్ సర్పంచ్ గా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షునిగా సుదీర్ఘ కాలం పాటు పని చేశారు. తన నియామకానికి సహకరించి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్సింగ్ లకు అన్నయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.అన్నయ్య గౌడ్ నియామకం పట్ల సుల్తానాబాద్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు వర్షం వ్యక్తం చేశారు.

# భరోసా ద్వారా మహిళల భద్రతకు భరోసా

## - జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**టీ మీడియా, అక్టోబరు 18, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లాలో అత్యాచార బాధితులకు వైద్య, న్యాయ, సైకాలజికల్ సపోర్ట్ వంటి సేవలు ఒకే గొడుగు కింద అందిస్తున్న పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో నడుపుతున్న భరోసా కేంద్రము బాధితులు ఆర్థికంగా కూడా ఎదిగేందుకు సహాయ సహకారాలు అందిస్తుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఫోక్సో అత్యాచార కేసుల్లో ఉన్న ఎంతోమంది బాధితులకు అన్ని రకాలుగా భరోసా కేంద్రం అండగా నిలుస్తుంది అని అలాగే భరోసా సిబ్బంది బాధితుల యొక్క నివాస ప్రాంతాలను సందర్శించి వారి సాంఘిక ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను భరోసా బాధిత సహాయ నిధి కింద 5 నుంచి పదివేల రూపాయల వరకు తక్షణ పరిహారం ఇవ్వడం జరుగుతుందని దానిలో భాగంగా ఒక గ్రామానికి చెందిన బాధితురాలికి వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని బాధితుల తక్షణ సహాయం నిధి కింద పీజీ కాలేజీ హాస్టల్ ఫీజు కట్టడానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఇవ్వడం జరిగింది. ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని స్వతగా తమ కాళ్లపై తాము ఆర్థికంగా ఆర్థికంగా నిలబడగలిగి మహిళ సాధికారతలో భాగం కావాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# చెప పిల్లలని వదిలిన ఎమ్మెల్యే



**టి మిడియా , అక్టోబర్ 18, మదనాపురం:**దేవరకద్ర నియోజకవర్గం మదనపురం మండలం శంకరంపేట్ వద్ద సరళ సాగర్ ప్రాజెక్టు లో తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేప పిల్లల పంపిణీ, చెరువులోకి చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలిసి చేప పిల్లలను వదిలాడు మత్స్య కారులకు కంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లలను ఇవ్వడం వారి కుటుంబాలకు ఎంతో మేలుజరుగుతూదన్నాడు.అనంతరం ఇటీవల నర్సింగపూర్ చెందిన కావలి చెన్నన్న ఉపాధి హామీ పనుల్లో పనిచేస్తూ గుండెపోటుతో మరణించడం తో ప్రభుత్వం తరపున రెండు లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రొసీడింగ్స్ ను వారి కుమారుడికి అందజేసిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

# నీలకొరిగిన వృక్షం



**టీ మీడియా, అక్టోబర్ 18, మహానంది:**మహానంది మండలం గోపవరం గ్రామ సమీపంలో నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారిపై రోడ్డుకి అడ్డంగా వృక్షం నేలకొరిగింది.ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అల్పపీడనం ప్రభావంతో గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వృక్షం కూలింది. ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి రోడ్డుపై కూలిన వృక్షాన్ని తొలగించాలని వాహనదారులు ప్రజలను కోరారు.




# ఉపకార వేతనాలను విడుదల చేయాలి

## -ఏ ఐ వై ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్


**టీ మిడియా, అక్టోబర్ 18 ,ఆత్మకూర్ :**రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఉన్న బోధనా ఫీజులు, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏ ఐ వై ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూర్ గాంధీ చౌరస్తాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2021 నుంచి 2024 వరకు మూడేళ్ల బకాయి రూ. 7700 కోట్లు చెల్లించవలసి ఉందన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం బోధనా ఫీజులు ఉపకార వేతనాల చెల్లింపు విధానం తెచ్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయటం లేదన్నారు. రాష్ట్రంలో ఇంటర్లో 1400 కాలేజీల్లో 9 లక్షల మంది విద్యార్థులు 944 డిగ్రీ కాలేజీల్లో ఆరు లక్షల మంది విద్యార్థులు 262 ఇంజనీరింగ్ కాలేజీల్లో లక్ష ఇరవై వేల మంది 200 పీజీ కాలేజీల్లో 20వేల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. బోధనా విధులను చెల్లించకపోవడం తో యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. మానసిక వేదనతో వారు చదువుకోలేకపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బోధన ఫీజు ఉపకార వేతనం బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేదంటే విద్యార్థుల సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఎస్ శేఖర్, రవికుమార్, ఎండి వసీం తదితరులు పాల్గొన్నారు.

# హాట్ టాపిక్‌గా మారిన దుబ్బాక రాజకీయం

### -చిచ్చురేపుతోన్న ప్రోటోకాల్ రచ్చ

**టీ మీడియా,అక్టోబర్ 18, దుబ్బాక :**ఈ మధ్య కాలంలో నియోజకవర్గ రాజకీయం ఎప్పుడు హాట్ టాపిక్ గానే ఉంటుంది. అక్కడ ఉన్న మూడు పార్టీల నేతలు ఢీ అంటే ఢీ అని వ్యవహరిస్తూ. ఎవరికి వారు తగ్గేదేలే అన్నట్లుగా మారడంతో ఆ నియోజచర్గంలో నిత్యం ఏదో ఒక రచ్చ నడుస్తూనే ఉంది. తాజాగా ప్రోటోకాల్ రచ్చతో మరోసారి వార్తల్లోకి వచ్చిందా నియోజకవర్గం. ఇంతకీ ఏంటా నియోజకవర్గం..

అప్పటి టీఆర్ఎస్ పార్టీ ఓటమి మొదలైన దుబ్బాక నియోజకవర్గం ఇప్పుడు పొలిటికల్‌గా హాట్ టాపిక్‌గా మారింది. దుబ్బాక రాజకీయం రోజు రోజుకు రసవత్తరంగా మారుతోంది. అక్కడ ఏ పార్టీ ప్రోగ్రాం జరిగిన ఎదో ఒక గొడవ జరగడం వార్తల్లోకి ఎక్కడం పరిపాటిగా మారుతోంది. గొడవలు ఎందుకులే మన పని మనం చేసుకుందాం అనే లీడర్ అస్సలు కనిపించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఇక ఇక్కడ ఉన్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొందని ఇటీవల జరిగిన సంఘటనలు చూస్తుంటే అర్థమవుతోంది. ఈ మూడు పార్టీల నేతలకు క్షణం కూడా పడడం లేదు. దీంతో ఎవరికి వారు ప్రోగ్రాం చేసుకున్న ఎదో ఒక రకంగా గొడవ జరుగుతూనే ఉంది. ఈ నియోజకవర్గ పరిధిలో ఏ పార్టీ ప్రోగ్రామ్ అయిన జరుగుతుంది అంటే ఇక్కడ ఉన్న పోలీస్‌లకు టెన్షన్ మొదలవుతుంది. ఎప్పుడు ఏ గొడవ జరుగుతుందో అని పోలీసులు సైతం టెన్షన్ పడే పరిస్థితి నెలకొంది.ఇక రానురాను ఈ గొడవలు పెరుగుతూనే ఉన్నాయి కానీ తగ్గడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రోటోకాల్ వివాదం తీవ్ర స్థాయిలోకి వెళ్లిందట. మొన్నటికి మొన్న ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ ఓ కార్యక్రమానికి వస్తే కూడా అక్కడ ప్రోటోకాల్ రగడ జరిగింది. నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సభ వేదిక పైకి ఎక్కగానే బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున్న గొడవకు దిగారు. మరో వైపు బీజేపీ నేతలు కూడా పెద్ద ఎత్తున్న నినాదాలు చేయడంతో ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ ప్రోగ్రాం మధ్యలో నుండే వెళ్లిపోవాల్సిన పరిస్థితి వచ్చింది.కాగా ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభకర్ రెడ్డి.. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఇద్దరికి ఒకరు అంటే ఒకరికి అసలు పడడం లేదని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. వీరికి తోడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి కూడా వీరితో ఉప్పు నిప్పు లాగే ఉంటున్నారని, అందుకే ఈ నియోజకవర్గ పరిధిలోని ఈ మూడు పార్టీల కార్యకర్తలు కూడా వారి వారి నేతల తీరుగానే ఉంటున్నారని చర్చ నడుస్తోంది. అందుకే ఇక్కడ ఉన్న మూడు పార్టీల మధ్య ఎప్పుడు ఎదో ఒక గొడవ జరుగుతూనే ఉంది.మొన్నటికి మొన్న దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపించారని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొని తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దుబ్బాకలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి వస్తున్న విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కాన్వయ్‌ని అడ్డుకునేందుకు ప్రయత్నించారని, బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. అంతటితో ఆగకుండా కాంగ్రెస్ నాయకులకు పోటీగా రంగంలోకి దిగారు. శివాజీ చౌక్ వద్దకు ఎమ్మెల్యే కాన్వయ్ వస్తుండగా..కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు స్పందిస్తూ కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు కోడి గుడ్లు విసిరేందుకు ప్రయత్నించారు. పోలీసుల జోక్యంతో రెండు పార్టీల నేతలు అక్కడి నుంచి వెనుదిరిగారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తుండటం హాస్యాస్పదంగా మారిందని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తమవంతుగా పోరాడుతుంటే .. కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సిగ్గు చేటు అని కేపీఆర్ విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారన్న ఆయన.. త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కాగా ఒకప్పుడు దుబ్బాక నియోజకవర్గం అంటే చాలా కొద్ది మందికే తెలిసేది కానీ.. రామలింగారెడ్డి మరణంతో వచ్చిన ఉప ఎన్నికలతో దుబ్బాక రాష్ట్ర వ్యాప్తంగా హాట్ నియోజకవర్గంగా మారింది. ఉప ఎన్నికలప్పుడు మొదలైన అగ్గి ఇప్పటి వరకు చల్లారడం లేదని, అప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీగా ఉంటే.. ఇప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అండ్ కాంగ్రెస్ గా మారిందని చర్చించుకుంటున్నారు.




# ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు

### -అధికారులను ప్రశ్నిస్తున్న దర్యాప్తు బృందం

**టీ మీడియా,అక్టోబర్ 18,బెంగళూరు :**మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో మైసూర్ లోని ముడా కార్యాలయంపై ఈడీ అధికారులు దాడులు చేశారు 12 మంది అధికారుల బృందం శుక్రవారం ఉదయం ముడా కార్యాలయంలో సోదాలు చేపట్టారు.ముడా కమిషనర్ ఏఎన్ రఘునందన్ సహా సీనియర్ అధికారులతో సమావేశం అయ్యారు. భూ కేటాయింపు కేసులో ముడా అధికారుల ప్రమేయాన్ని నిర్ధారించేందుకు దర్యాప్తు సంస్థ అధికారులు వారిని ప్రశ్నిస్తున్నారు. అనంతరం కేసుకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది.



**ముడా చైర్మన్ రాజీనామా**

కాగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ముడా చైర్మన్ కే మరిగౌడ బుధవారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాలతో పాటు తన అనారోగ్య సమస్యల వల్ల రాజీనామా చేస్తున్నానని, తనపై ఎలాంటి ఒత్తిడి లేదని ఆయన ప్రకటించారు. ముడా స్కామ్‌పై విచారణ కొనసాగుతున్నదని, అక్రమాలు జరిగాయా అనేది విచారణలో తేలుతుందని పేర్కొన్నారు. తాను 40 ఏండ్లుగా సిద్ధరామయ్యతో ఉన్నానని, ఆయనే తనను తాలుకా, జిల్లా పంచాయతీ అధ్యక్షుడిని చేశారని, చట్టవ్యతిరేక పనులు చేయమని ఆయన తనకు ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. ఆయన రాజీనామా చేసిన రెండు రోజుల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది.

**సీఎంపై ఆరోపణలు..**

మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూకుంభకోణం ఆరోపణలు కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అడ్డంగా బుక్కయ్యారు. ముడా నుంచి తన భార్యకు అనుచితంగా లబ్ధి కలిగించినట్లు సీఎంపై ఆరోపణలున్నాయి. దీంతో కుంభకోణం వ్యవహారంలో సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు, ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ వివాదం నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి కేటాయించిన 14 స్థలాలను ముడా అధికారులు ఇటీవలే వెనక్కి కూడా తీసుకున్నారు. ముడా కుంభకోణం నేపథ్యంలో, తనకు కేటాయించిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని సీఎం భార్య మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ 14 ప్లాట్లను వెనక్కి తీసుకుంటూ సేల్‌డీడ్‌ను రద్దు చేయాలని ముడా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఈ కుంభకోణం వ్యవహారంలో సిద్ధరామయ్యపై విచారణ కొనసాగుతోంది. ఇక ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయి విచారణను ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్య ఏ క్షణంలోనైనా పదవిని కోల్పోతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## స్కిల్ యూనివర్సిటీ కి ఆదాని

# రూ. 100 కోట్లు విరాళం

**టి మీడియా,అక్టోబర్ 18,హైదరాబాద్ బ్యూరో :**



విద్యార్థులు, యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో నెలకొల్పిన యంగ్ ఇండియా తెలంగాణ స్కిల్స్ యూనివర్శిటీకి ప్రఖ్యాత అదానీ గ్రూప్ రూ. 100 కోట్ల విరాళం అందించింది. అదానీ గ్రూప్ చైర్‌పర్సన్ గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ ఫౌండేషన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి ఈ మేరకు విరాళం చెక్కును అందజేశారు. నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు నిరంతర మద్దతు ఉంటుందని గౌతమ్ అదానీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి శాంతికుమారి , ఇతర అధికారులు కూడా ఉన్నారు.










## విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత.

**టీ మీడియా,అక్టోబర్ 18,ఆర్మూర్ :**పట్టణానికి చెందిన పి.శశాంక్ బిబిఏ చదువు కోసం ఈరవత్రి రాందాస్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో రూ.20 వేలను అందజేశారు. పట్టణంలో సిఏ రాజశేఖర్ కార్యాలయంలో శుక్రవారం డబ్బులను అందజేశారు. పట్టణానికి చెందిన శశాంక్ హైదరాబాద్ లోని ఐ క్రియేట్ కళాశాలలో బిబిఏ ఫైనలియర్ చదువుతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక చదువు మధ్యలో మానేసే పరిస్థితి వచ్చిందని తెలుసుకొని ఈరవత్రి రాందాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి శశాంక్ చదువు మధ్యలో నిలిచిపోకుండా ఉండడం కోసం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సడాక్ ప్రమోద్, బదాం రాజ్ కుమార్, సిరిగిరి జీవన్, ఈరవత్రి సురేందర్, హజారి సతీష్, దాసరి గోపికృష్ణ, ప్రవీణ్, సాయి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



## మొగులు.. గుబులు

### -ఓవైపు కోతకొచ్చిన పొలాలు..

### -మరో వైపు అకాల వర్షం

**టీ మీడియా, అక్టోబర్ 18,మల్హర్ రావు:**అయితే అతివృష్టి లేదా ఆనావృష్టి రైతులను నిండా ముంచుతోంది. వారి ఆశలను అకాల వర్షభయం వెంటాడుతోంది. గత మూడు వారాల క్రితం పొలాలకు కాల్వల ద్వారా నీరు అందక ప్రాజెక్టులు, చెరువుల, బోర్ బావుల కింద కొన్ని ఎండిపోయాయి. ప్రస్తుతం పొలాల కొత దశలో ఉన్నాయి. నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి పొద్దంతా ఎండ సాయంత్రం కాగానే కారు మబ్బులు, చిరు జల్లులు కురుస్తుండటంతో రైతులు ఆందోళన గురివుతున్నారు. మండలంలో మొత్తం 10,348 ఎకరాల్లో వరి పంటలు వేశారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించడంతో సగానికి కన్న ఎక్కువ శాతం సన్నాలు పెట్టారు.పంట కలుపు దశలో నీరు అందక పొట్ట దశలో చీడపీడలు ఆశిస్తే,కోత దశలో కారు మబ్బులు, చిరు జల్లులు వెంటాడడంతో వేసిన పంటలకు పెట్టుబడులైన వస్తాయో రావొని రైతుల ఆందోళనకు గురివుతున్నారు. రైతుల ధాన్యం విక్రయచడానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము, డిసిఓ ఆధ్వర్యంలో 22 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.



## గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన..

### -లాఠీ-ఛార్జ్ చేసిన పోలీసులు

### - పలువురికి గాయాలు

**టీ మీడియా, అక్టోబర్ 18,హైదరాబాద్?:**గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని కోరుతూ అశోక్‌నగర్‌లో అభ్యర్థులు మరోసారి ఆందోళనకు దిగారు. ఈనెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ రోడ్లపైకి చేరుకుని నినాదాలు చేస్తు ర్యాలీ చేపట్టారు. ప్లకార్డులతో రోడ్లపైకి వచ్చిన 16 మందిని పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు లాఠీ చార్జీ చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. వందల సంఖ్యలో చేరుకున్న అభ్యర్థులు గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షల్లో తప్పులు, జీవో 29 సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనల నేపథ్యంలో అశోక్‌నగర్‌లో పోలీసు పహారాలి కొనసాగుతోంది. మరోవైపు ఈనెల 21 నుంచి నిర్వహించనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు మార్గం సుగమం అయింది.లి గ్రూప్-1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. దీంతో లిషెడ్యూల్ ప్రకారమే ఈనెల 21 గ్రూప్-1 పరీక్షలు జరగనున్నాయి.

### అటవీ పరిశోధన సంస్థలో

## పాములపై అవగాహన..

**టీ మీడియా, అక్టోబర్ 18,ములుగు:**సిద్దిపేట జిల్లా ములుగు మండలం కేంద్రంలోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్.సి.ఆర్.ఐ)లో ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పాములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు గంటల పాటు జరిగిన అవగాహన ఈ కార్యక్రమంలో భాగంగా విష సర్పాలను, విషం లేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.ఎస్. శ్రీనిధి మాట్లాడుతూ "సమాజంలో సర్పాలంటే అందరికీ ప్రతికూల భావన ఉంది. పాములన్నీ ప్రమాదకరమైనవి కాదు. కేవలం కొన్ని రకాల పాములు మాత్రమే విషపూరితమైనవి మిగిలిన అనేక రకాల పాములు పంటలను నాశనం చేసే ఎలుకలను, ఇతర కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయి. పాము కరిచినపుడు ప్రథమ చికిత్స చాలా ముఖ్యమైనది. మనం బ్రతుకుతూ ఇతర జీవరాశులను బ్రతకనివ్వాలి అనే స్పృహ కలిగి ఉండి పాములను రక్షించుకుందాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో 120 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

